క్లుప్తంగా

శనగ విత్తనాలు మంజూరు

సి.బెళగల్: మండలానికి 280 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు అయినట్లు ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. క్వింటాం రూ.9,400 ఉండగా, 25 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 20 కేజీల ప్యాకెట్ రూ.1,410 ఉంటుందని, రైతులకు కనిష్టంగా 20 కేజీలు గరిష్టంగా 80 కేజీల ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఏఓ సూచించారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



తిరుపాడు గ్రామంలో మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గడివేముల: దళారుల చేతిలో మొక్కజొన్న రైతులు మోసపోకుండా ప్రభుత్వం అండగా ఉండాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న కోరారు. శనివారం మండల పరిధిలోని తిరుపాడు, కొర్రపోలూరు గ్రామాల్లో సీపీఐ నాయకులతో కలిసి వారు పర్యటించారు. మొక్కజొన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వరి తర్వాత ఎక్కువగా పండించే పంట మొక్కజొన్న అన్నారు. అయితే దిగుబడులు వచ్చాక దళారుల చేతుల్లో మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. సెప్టెంబర్‌లో రూ.2,950 ఉండగా ఇప్పుడు దళారులు రూ.2,350 మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, బాషా, ఇబ్రహీం, రసూల్ ,నబి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలి



జాతీయ పోటీల్లో పాల్గొంటున్న వెయిట్‌లిఫ్టర్‌ను అభినందిస్తున్న బోయ సేవా సంస్థ అధ్యక్షులు తలారి క్రిష్ణ నాయుడు

కర్నూలు (టౌన్) : ఈనెల 6 నుంచి 13 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆకాంక్షించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని తన చాంబర్‌లో క్రీడాదాత శ్రీధర్ రెడ్డి, వాల్మీకి బోయ సేవా సంస్థ అధ్యక్షుడు తలారికృష్ణ నాయుడు జాతీయ పోటీల్లో పాల్గొంటున్న వెయిట్ లిఫ్టర్ బి. వీరేష్‌ను శాలువా కప్పి ఆర్థిక సహయం అందించారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలి, కోచ్ యూసుఫ్‌బాషా పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రవేశాల కోసం ఈ నెల 7 నుంచి 9వ తేదీ లోపు అయితే రూ.400 రుసుము, 10వ తేదీ నుంచి 12వ తేదిలోపు అయితే అదనంగా రూ.100 ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ క్లస్టర్ యూనివర్సిటీ(బిక్యాంపు)లో జరుగుతుందన్నారు. ప్రవేశాల కొరకు విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. మొదటి మూడు దశల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందడానికి అవకాశం లేదని, ఒక వేళ స్పాట్ అడ్మిషన్ ద్వారా క్లస్టర్ యూనివర్సిటీ కాలేజీల్లో సీటు పొందాలనుకుంటే తాను పొందిన అడ్మిషన్ సీటును రద్దు చేసుకొని స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చన్నారు.

ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న చిరంజీవి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని ప్రతి కార్యాలయం వెలుపల ఆర్‌టీఐ బోర్డులు ఏర్పా టు చేయాలని డీఆర్వో టి.చిరంజీవి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఆర్‌టీఐ– 2005 చట్టం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్‌టీఐ కార్యకర్తలు అడిగే సమాచారం కోసం రికార్డులను కూడా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఇందు కోసం రిజిస్ట్రార్–1, 2లను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

కొనలేం... తినలేం!

- పండుగ పూట ధరల మంట
- మండుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- అవస్థలు పడుతున్న సామాన్యులు



వ్యాపారం లేక వెలవెలబోతున్న కిరాణ దుకాణం

కోడుమూరు రూరల్ : పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం దుర్భరంగా మారుతుంది. రోజురోజుకూ నిత్యావసర ధరలు పెరుగుతుతండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి దసరా పండుగ సందర్భంగా మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలను చూసి మధ్యతరగతి, సామాన్య ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. గత రెండు నెలల నుంచి మార్కెట్లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పండుగ పూట సరుకులు కొందామని మార్కెట్‌కు వెళ్తే ఆకాశన్నంటుతున్న ధరలతో ప్రజల గుండె దడ పెరిగిపోతుంది. ఓ వైపు కిరాణ వస్తువులు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగిపోతుండడంతో పేద ప్రజలు ఏమి కొని తినలేని పరిస్థితి నెలకొంది. సన్‌ఫ్లవర్, పామాయిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అదేవిధంగా పామాయిల్, కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపుగా రెట్టింపు కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ 15లీటర్ల డబ్బా రెండు నెలల కిందట రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ.2,000 పైగానే పలుకుతోంది. దీంతో కొనలేం.. తినలేం అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు సామాన్యులు.

కిరాణ దుకాణాలు వెలవెల....

పండుగ వేళ ప్రజల కొనుగోళ్లతో కిటకిటలాడాల్సిన కిరాణ దుకాణాలు వెలవెలబోతున్నాయి. హోల్‌సెల్ తోపాటు రిటైల్ షాపుల నిర్వాహకులు సైతం వ్యాపారాలులేక ఖాళీ కూర్చున్నారు. ఎవరైనా వచ్చినా అరకొర సరుకులు తీసుకెళ్తున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో ఉన్నంతలో అరకొర కొనుగోళ్లతో సర్దుకుంటున్నారు పేదలు.

మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు బియ్యంతో పాటు, చెక్కర, కంది బేడలు పంపిణీ చేసేది. నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం కార్డుదారులకు ప్రభుత్వం కంది బ్యాళ్లను ఇవ్వకుండా కేవలం చెక్కర, బియ్యంతో సరిపెడుతోంది. కంది బ్యాళ్లను పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైదంటూ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.



వస్తువు పేరు -కిలోలలో	2నెలల కిందట ధర	ప్రస్తుతం ధర
సోనమసూరి బియ్యం	రూ.60	రూ.70
పామాయిల్ లీటర్	రూ.90	రూ.130
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ.115	రూ.140
మైదా పిండి	రూ.40	రూ.45
గోదుమ పిండి	రూ.40	రూ.45
చింత పండు	రూ.120	రూ.160
వెల్లుల్లి	రూ.200	రూ.400
కంది బ్యాళ్లు	రూ.170	రూ.180
ఎండు కొబ్బరి	రూ.140	రూ.200
శనగ బ్యాళ్లు	రూ.90	రూ.100
పప్పులు	రూ.100	రూ.120
ఉప్మా రవ్వ	రూ.40	రూ.45
బెల్లం	రూ.50	రూ.55
చెక్కెర	రూ.40	రూ.45
శనగ పిండి	రూ.100	రూ.120
టెంకాయ ఒకటి	రూ.20	రూ.35

సగానికి పైగా వ్యాపారాలు పడిపోయాయి



పండుగ వేల జోరుగా ఉండాల్సిన వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. పెరిగిన రేట్లతో చాలామంది ప్రజలు కిలో తీసుకునే చోట అరకిలో తీసుకుని సరిపెడుతున్నారు. గతంలో ఎప్పుడు కూడా ఇంత అధ్వానంగా జరిగింది లేదు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి వస్తువులు తెప్పిస్తే వ్యాపారాలు లేని పరిస్థితి నెలకొంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

– వీరేష్, కిరాణ వ్యాపారి, కోడుమూరు

ఏమి కొనలేని పరిస్థితి



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరిగిన ధరలతో మార్కెట్లో ఏమి కొనలేని పరిస్థితి నెలకొంది. మొన్నటి వరకు కూరగాయల ధరలతో ఇబ్బందులు పడితే ప్రస్తుతం కిరాణ సరుకుల ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. పండుగ పూట ఏది కొందామన్న ధరలను చూసి గుండెదడ వస్తోంది. ఇలాగైతే మాలాంటి మధ్యతరగతి ప్రజలు ఎలా జీవించాలి.

– నాగరాజు, కోడుమూరు

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ఘోరంగా విఫలమయ్యాయి. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఏమి కొనలేని పరిస్థితి. చాలామంది ప్రజలు పచ్చడి మెతుకులతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు స్పందించి విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

రైతులకు నష్టపరిహారం అందజేయండి

కర్నూలు (రూరల్) : జాతీయ రహదారి నిర్మాణంలో (చెన్నై– సూరత్) భూములు కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం అందజేయాలని కోరుతూ శనివారం ఆర్డీఓ సందీప్ కుమార్‌కు కొంతమంది రైతులకు పరిహారం అందలేదు అని రైతు సంఘం నాయకులు ఆర్‌డీఓ దృష్టికి తీసుకువచ్చారు. రైతు సంఘం, డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. గార్గేయపురానికి చెందిన కొందరు రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, ఇప్పటికైనా అందజేయాలని రైతు సంఘం నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఆర్డీఓను కోరారు. అదేవిధంగా ఓర్వకల్లు మండలంలో జయరాజ్ స్టీల్ ప్లాంట్ కొరకు మూడు టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్‌కు ముచ్చుమర్రి పంపింగ్ స్టేషన్ నుంచి పైప్‌లైన్ల ఏర్పాటు చేస్తున్నారని, భూములు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వారు విన్నవించారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో కూడా నారాయణ విద్యా సంస్థలు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ కాలేజీలో తరగతులు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ నాయకుల పరిశీలనలో బయట పడింది. దీంతో ఆ సంఘం నాయకులు కాలేజీలకు సెలవులు ప్రకటించినా ఎందుకు తరగతులు నిర్వహిస్తున్నారని కాలేజీ ప్రతినిధులను ప్రశ్నించారు. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విద్యార్థి సంఘం నాయకులు తరగతుల్లోకి వెళ్లి పిల్లలను ఇళ్లకు పంపించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని, తరగగులు నిర్వహిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమం సంఘం నాయకులు విజయ్, దామోదర్, మధు, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదుపై విచారణ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామలంలో సోలార్ పరిశ్రమ ప్రతినిధులు పంటలను తొలగించడంపై రైతులు ఇటీవల నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారికి రైతులు వినతి పత్రం అందించారు. ఈ మేరకు శనివారం నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి పాణ్యం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సర్వే 3లో 29ఎకరాల సాగు భూమి ఉంది. అందులో దాదాపుగా 22ఎకరాల వరకు సోలార్ కంపెనీ కొనుగోలు చేసింది. ఆ భూములను అలాగే వదిలేయడంతో రైతులు వేలకు వేలు పెట్టుబడిపెట్టి పంటను సాగు చేశారు. అయితే పరిశ్రమ పనుల్లో భాగంగా సబ్ కంపెనీ ప్రతినిధులు భారీ యంత్రాలతో పంటను తొలగించారు. రైతులు పంటను తొలగించవద్దని కోరినా దాదాపుగా 25సెంట్లకుపైగా తొలగించారు. దీంతో మిగిలిన రైతులు కూడా తాము పంట దిగుబడికి వచ్చేంత వరకు ఆగాలని కోరుతున్నారు. సేకరించిన వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, డీటీ శంకర్‌రెడ్డి, ఆర్ఓ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా జడ్జి కబర్ధీ



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్ధీ

కోడుమూరు రూరల్ : మహిళల రక్షణకు చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి కబర్ధీ సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా జడ్జి కబర్ధీ, జిల్లా న్యాయసేవా సదన్ సెక్రటరీ లీలావెంకట శేషాద్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా జడ్జి కబర్ధీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు. ప్రతి మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు చట్టాలకు లోబడే ప్రవర్తించాలని సూచించారు. ఎవ్వరితోనైనా బాధింపబడుతున్న మహిళలు తమను సంప్రదిస్తే జాతీయ ఉచిత న్యాయ సేవా సంస్థ ద్వారా న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ సమాజంలో మహిళల రక్షణకు అనేక చట్టాలున్నా నేటికి అనేక దురాగతాలు జరుగుతున్నాయన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ జరిగినప్పుడు ఏ విధంగా చట్టాల ద్వారా రక్షణ పొందాలన్న విషయాలను యువతులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ సరసమ్మ, ఎంపీడీఓ రాముడు, ట్రైబర్ వెల్ఫేర్ ఆఫీసర్ గుర్రప్ప, ఏపీఎం రాయుడు, సీనియర్ అడ్వకేట్లు మనోహర్, హేమలత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కోడుమూరులో శాకాంబరిగా దర్శనమిస్తున్న అంబా బవానీ



అన్నపూర్ణదేవి అలంకరణలో నాగలాపురం సుంకులా పరమేశ్వరీ



ఓర్వకల్లు: లొద్దిపల్లెలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



హుసేనాపురంలో కొలువుదీరిన అమ్మవారు

బహురూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



కోడుమూరులో శ్రీవల్లెలాంబదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



సి.బెళగల్: అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాత, శ్రీరాములమ్మ, శ్రీ తులజా భవాని, శ్రీఅంబా భవానీ అమ్మవారు శ్రీగాయత్రి దేవి, శ్రీశాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. శ్రీ వల్లెలాంబదేవి అన్నపూర్ణ దేవి అలంకారంలో ఆకట్టుకున్నారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో అమ్మవారికి పల్లకీ సేవా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరులో...

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం గూడూరు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.నాగలాపురం గ్రామంలో వెలసిన శ్రీసుంకులపరమేశ్వరీ అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శనివారం అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఓర్వకల్లు: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లొద్దిపల్లె గ్రామం మెయిన్‌రోడ్డుపై కొలువుదీరిన అమ్మవారికి పూజారి మద్దిలేటి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. హుసేనాపురంలో జాతీయ రహదారిపై కొలువుంచిన అమ్మవారికి పురోహితులు మనోహరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాణ్యం: దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య సాగుతున్నాయి. శనివారం రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులను అలరించారు. అలాగే శ్రీ వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా, పాణ్యం హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సి.బెళగల్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రం సి.బెళగల్‌లో కొలువైన అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజారి సుదర్శనమాచార్యులు స్థానిక ఈశ్వర ఆలయ ఆవరణలో కొలువైన అమ్మవారికి అష్టోతరజపం, సహస్రనామార్చన, పారాయణం, పంచామృత అభిషేకం, కుంకుమార్చలనలు నిర్వహించారు. కోమటి వీధిలో వెలసిన శ్రీ కన్యక పరమేశ్వరి దేవి, బస్టాండ్‌లో పార్వతి అమ్మవార్లు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



గడివేముల: బాలత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



పాణ్యం: రాజరాజేశ్వరీ అలంకారణలో అమ్మవారు



అన్నపూర్ణ దేవిగా ...



అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు

మితిమీరిన తమ్ముళ్ల పెత్తనం!

- బదిలీపై వచ్చిన ఉద్యోగులను నియమించుకోవద్దంటూ హుకుం
- తమవారినే తెచ్చుకుంటామంటూ అధికారులకు బెదిరింపులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విధులలో చేరేందుకు నిరీక్షిస్తున్న ఉద్యోగులు

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వంలో అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. తెలుగు తమ్ముళ్ల జోక్యం మితిమీరడంతో అధికారులకు దిక్కుతోచడం లేదు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల విషయంలో అధికారపార్టీ నాయకుల ఒత్తిడితో అయోమయానికి గురువుతున్నారు అధికారులు. ఇతర ప్రాంతాల నుంచి సి.బెళగల్ మండలానికి బదిలీ అయిన ఉద్యోగులకు మండల అధికారులు పోస్టింగ్ ఇవ్వలేని పరిస్థితి నెలకొందంటే తమ్ముళ్ల పెత్తనం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం అవుతుంది. పంచాయతీ కార్యదర్శుల బదిలీల వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. మండలం నుంచి గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల పంచాయతీ క్యాదర్శులు (గ్రేడ్ –5), సంక్షేమ, ఇంజినీర్, సర్వేల సహాయకులు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఇతర మండలాల నుంచి ఆయా ఖాళీ పోస్టుల మేరకు ఉద్యోగులు ఇక్కడికి బదిలీ అయ్యారు కూడా. ఇక్కడి నుంచి బదిలీ అయిన ఉద్యోగులను రిలీవ్ చేయొద్దు, ఇక్కడికి వచ్చినవారికి జాయిన్ చేసుకోవద్దంటూ టీడీపీ నాయకులు మండల అధికారులపై హుకుం జారీ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల్లో చేరేందుకు రెండురోజులుగా మండల కేంద్రంలో ఉద్యోగులు నిరీక్షిస్తున్న తీరు ఇందుకు బలం చేకూరుస్తుంది. మండల పరిషత్ కార్యాలయం, ఈఓఆర్డీ ఛాంబర్‌లో విధుల్లో చేరేందుకు వచ్చిన ఉద్యోగులు పడిగాపులు కాస్తున్నారు. ఈ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

పంతం నెగ్గించుకునేందుకు ఇద్దరు టీడీపీ నాయకులు పోటీ

మండలంలో తమ పంతం నెగ్గించుకునేందుకు ఇద్దరు టీడీపీ నాయకుల మధ్య పోటీ నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఇందుకు వేదికగా మారింది. ఓ నాయకుడు చెప్పిన వ్యక్తికి కాకుండా, మారో మండల నాయకుడు, మాజీ ప్రజా ప్రతినిధి సిఫారుసు చేసిన వ్యక్తికి పోస్టింగ్ రావడంతో విభేదాలు బట్టబయలు అయ్యాయి. దీంతో కర్నూలులో నివాసం ఉంటున్న నియోజకర్గస్థాయి నాయకుడి ఇంట్లో పెద్దఎత్తున చర్చ కూడా జరిగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

తన మిత్రుడికి పంచాయతీ కార్యదర్శి పోస్టింగ్ ఇవ్వాల్సిందే...

మండల కేంద్రం సి.బెళగల్ టీడీపీ నాయకుడు తన మిత్రుడిని ఇక్కడికి బదిలీ చేయించుకునేందుకు కంకణం కట్టుకున్నారు. గతంలో మండలంలో పనిచేసిన తన మిత్రుడిని పంచాయతీ కార్యదర్శి నియమించాలని ఈ లీడర్ నియోజకవర్గ టీడీపీ నాయకుడు, ఎమ్మెల్యేకు విన్నవించినట్లు సమాచారం. అయితే ఇందుకు విరుద్ధంగా కర్నూలు మండలం రుద్రవరం పంచాయతీ కార్యదర్శిని ఇక్కడికి బదిలీ అయ్యారు. దీంతో ఆ నాయకుడు తీవ్ర మనస్థాపం చెందినట్లు తెలిసింది. తన మిత్రుడిని ఇక్కడికి నియమించాలని మరోమారు భీష్మించడంతోపాటు ఆ పోస్టులో ఎవరికీ బాధ్యతలు ఇవ్వొద్దని అధికారులపై సైతం ఒత్తిడి తెచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

నేటి నుంచి షూటింట్ బాల్ పోటీలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని గురుకుల పాఠశాలలో ఆదివారం నుంచి ఏడవ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ షూటింట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ రాఘవేంద్ర తెలిపారు. ఇతర జిల్లాలకు చెందిన బాల,బాలికలు హాజరవుతారని, ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.